సాక్షి పల్నాడు

సోమవారం । 14 । అక్టోబర్ । 2024



రేషన్ బియ్యం పట్టివేత

నరసరావుపేటటౌన్: కోటప్పకొండ రోడ్డులో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ఫిరంగిపురం గ్రామానికి చెందిన కుంబా నాగరాజును అరెస్ట్ చేశారు.



పులిచింతల ప్రాజెక్టు నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 17,429 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 30,230 క్యూసెక్కులు వదులుతున్నారు.

రాజరాజేశ్వరిగా బాలచాముండేశ్వరీ



అమరావతి:అమరావతి క్షేత్రంలో శ్రీదేవీ శరన్న వరాత్రి మహోత్స వాలలో శ్రీ బాలచా ముండిక సమేత అమరే శ్వరాలయంలో శని వారం అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు.

న్యూస్‌రీల్

నేడు తెనాలి ఐటీఐ కళాశాలలో అప్రెంటీస్ మేళా

తెనాలిఅర్బన్: తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సోమవారం పీఎం నేషనల్ అప్రెంటీస్ మేళాను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ రావి చిన్నవెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. 15 ప్రముఖ కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు తమ బయోడేటాతోపాటు విద్యార్హత సర్టిఫికెట్‌లు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ ఫొటోలతో ఉదయం 9.30 గంటలకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 9014491772, 9959828100 సెల్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బంగారు పతకం సాధించిన పవర్‌లిఫ్టర్ సాదియా ఆల్మాస్



మంగళగిరి : ఈ నెల 4వ తేదీ నుంచి 13 వరకు సన్‌సిటీ సౌత్ ఆఫ్రికా దేశంలో జరిగిన కామన్‌వెల్త్ పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్, జూనియర్ పోటీలలో మంగళగిరికి చెందిన పవర్ లిఫ్టర్ సాదియా ఆల్మాస్ 57 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించినట్లు పవర్ లిఫ్టింగ్ గుంటూరు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శనివారం తెలిపారు. స్క్వాట్ 185 కిలోలు, బెంచ్‌ప్రెస్ 95 కిలోలు, డెడ్ లిఫ్ట్ 180 కిలోలు, ఓవరాల్ 460 కిలోల విభాగాలలో బంగారు పతకం సాధించినట్లు తెలిపారు.

నృసింహస్వామి పారువేట మహోత్సవం

గిరిప్రదక్షిణలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు




మంగళగిరి : శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారి పారువేట (గిరి ప్రదక్షిణ) మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మేళ తాళాలతో గ్రామోత్సవాన్ని నిర్వహించగా భక్తులు స్వామి వారికి టెంకాయలు కొట్టి పూజలు నిర్వహించారు. ఉత్సవాన్ని ఆలయ ఈవో ఏ.రామకోటిరెడ్డి పర్యవేక్షించగా భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

అమరావతిలో శమీపూజ




అమరావతి: విజయదశమి నాడు అమరారామంలోని శ్రీ బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామివారికి ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సాయంత్రం 7 గంటలకు పారువేట ఉత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయంలోని రెండవ ప్రాకారంలోని జమ్మిచెట్టు వద్ద శమీ పూజను ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపీనాథశర్మతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 588.40 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 6,041 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 1516 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 257, తూర్పు కెనాల్‌కు 86, పశ్చిమ కెనాల్‌కు 77, నిజాంపట్నం కాలువకు 140, కొమ్మమూరు కాలువకు 640 క్యూసెక్కులు విడుదల చేశారు.

భజే భవానీ అంటూ అమ్మవారి జయ జయధ్వానాల మధ్య శ్రీ దేవి శరన్నవ రాత్రుల్లో ఆఖరి అంకం ఘనంగా ముగిసింది. ఉత్సవాల్లో విజయదశమి రోజున అమ్మవారు రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెలుగు రాష్ట్రాల నుంచి భవానీలు పెద్ద సంఖ్య లో తరలిరావడంతో ఇంద్రకీలాద్రి పరిసరాలు అమ్మ నామస్మరణతో మార్మోగాయి.. దుర్గమ్మ సన్నిధిలో పూర్ణాహుతి చేయడంతో ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి. శనివారం సాయంత్రం గంగాపార్వతీ (దుర్గ) సమేత మల్లేశ్వస్వామి వార్లకు హంసవాహన సేవ చేశారు.





జయ..జయహే

- నేత్రపర్వం.. ఆది దంపతుల హంస వాహనసేవ
- పూర్ణాహుతితో ముగిసిన దసరా ఉత్సవాలు
- రికార్డు స్థాయిలో దర్శించుకున్న భవానీలు
- శనివాం ఒక్క రోజే 1.70 లక్షల మందికి దర్శనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శరన్నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని మంగళవాయిద్యాల నడుమ.. నేత్రపర్వంగా ఆదిదంపతుల వాహన సేవ శనివారం సాయంత్రం జరిగింది. పవిత్ర కృష్ణా నదిలో సాయం సంధ్య వేళ హంసవాహనంపై కొలువుదీరిన ఆది దంపతులకు అర్చకులు పూజా కార్యక్రమాలు చేశారు. ఆలయ ఈవో కె.ఎస్.రామరావు దంపతులు, కలెక్టర్ సృజన, సీపీ రాజశేఖర్‌బాబు, ఇతర పోలీసు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. హంసవాహన సేవపై వేద పండితులు చక్కటి వ్యాఖ్యానం చేశారు. ఐలాండ్ వద్ద బాణసంచా వెలుగుల్లో హంసవాహన సేవ తిలకించిన భక్తులకు మధురానుభూతులను మిగిల్చింది. కృష్ణా నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో హంసవాహన విహారాన్ని రద్దు చేశారు. దుర్గాఘాట్‌లోనే ముల్లోకాలకు గుర్తుగా నదిలో హంస వాహనాన్ని మూడు సార్లు ముందుకు నడిపించారు. అంతకు



తెప్పోత్సవానికి ఉత్సవమూర్తులను తీసుకొస్తున్న దృశ్యం

ముందు ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి ఆలయం సమీపంలోని యాగశాల నుంచి ఆది దంపతుల నగరోత్సవం వైభవంగా ప్రారంభమైంది. ఈవో రామరావు పూజలు చేసి ఊరేగింపును ప్రారంభించగా, బేతాళ నృత్యాలు, తీన్మార్ డప్పులు, కోలాట నృత్యాలు, భక్తజనుల జయజయధ్వానాల మధ్య ఊరేగింపు దుర్గాఘాట్‌కు చేరుకుంది.

రూ.10 లక్షల బంగారు హారం

దుర్గమ్మకు నెల్లూరుకు చెందిన వ్యాపారవేత్త పంకజ్‌రెడ్డి, సరిత దంపతులు రూ.10 లక్షల విలువైన బంగారు హారాన్ని బహూకరించారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వారికి ఈవో కె.ఎస్.రామరావు అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు

రికార్డు స్థాయిలో భవానీలు, భక్తులు

దసరా ఉత్సవాల్లో చివరి రోజు శనివారం అమ్మవారు శ్రీరాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున అమ్మవారికి అలంకరణ, పూజల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. శనివారం తెల్లవారుజామకే నగరానికి పెద్ద ఎత్తున భవానీలు చేరుకోవడంతో వీఎంసీ కార్యాలయం సమీపంలోని కంపార్టుమెంట్లు పూర్తిగా నిండి రోడ్డుపైకి బారులు తీరి కనిపించారు. భవానీలు, సాధారణ భక్తులు ఒకే క్యూలైన్‌లో కొండపైకి చేరుకుంటుండటంతో దర్శనానికి నాలుగు నుంచి 5 గంటల సమయం పట్టింది. శనివారం ఒక్క రోజే 1.70 లక్షల మంది భవానీలు, భక్తులు అమ్మవారిని దర్శించుకోగా, ఒక్క రోజే ఆరు లక్షలకు పైగా లడ్డూలను విక్రయించారు. శనివారం అర్ధరాత్రి ఒంటి గంట వరకు దర్శనానికి భవానీలను అనుమతించారు. అరగంట తర్వాత తిరిగి ఆలయ ద్వారాలను తెరిచి అమ్మవారికి పూజలు చేసి తిరిగి దర్శనాలు ప్రారంభించారు. ఆదివారం అమ్మవారి దర్శనం చేసుకున్న భవానీలకు మనిషికి నాలుగు లడ్డూలను మాత్రమే దేవస్థానం అందించింది. భవానీలు, భక్తులకు లడ్డూలు అందాలనే భావన తో కౌంటర్లను కలెక్టర్ సృజన పర్యవేక్షిస్తూ సిబ్బందికి సూచనలు చేశారు. భవానీలు అమ్మవారి దర్శనం అనంతరం ఇరుముడులను సమర్పించి దీక్షలను విరమించారు. వారికి రాజగోపురం ఎదుట భోజన వసతి కల్పించారు. ఆదివారం కూడా రికార్డు స్థాయిలో భవానీలు విచ్చేయగా, దేవస్థానం వీఐపీ దర్శనాలతోపాటు కొండపైకి అన్ని వాహనాల రాకపోకలను నిలిపివేసింది. శని, ఆదివారాలలో అన్ని దర్శన టికెట్ల విక్రయాలను నిలిపివేశారు. ఈవో పలుసార్లు క్యూలైన్లను పర్యవేక్షించారు. శనివారం దేవస్థానానికి రూ.88.60 లక్షల ఆదాయం లభించినట్లు ఈవో పేర్కొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో పూర్ణాహుతి



ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిదిలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలు శనివారం నిర్వహించిన పూర్ణాహుతితో ముగిశాయి. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో వైదిక కమిటీ పూర్ణాహుతి చేయగా ఈవో కెఎస్.రామరావు, స్పెషల్ ఆఫీసర్ రామచంద్రమోహన్ పూజలు నిర్వహించారు. అనంతరం వేద ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు రంగావజ్జుల శ్రీనివాసరావు శర్మ, ఇతర వేద పండితులు పాల్గొన్నారు.

కిక్కు ద(ప)క్కేదెవరికో!

నేడు మద్యం టెండర్ల లాటరీ

- నరసరావుపేట టౌన్ హాల్‌లో ఏర్పాట్లు పూర్తి
- కలెక్టర్ సమక్షంలో లాటరీ విధానంలో మద్యం షాపులు కేటాయింపు
- టెండర్ దక్కిన వారు 1/6 వంతు లైసెన్స్ ఫీజు చెల్లించాలి
- జిల్లాలో 129 దుకాణాలకు 2,639 దరఖాస్తులు
- ఏర్పాట్లు పరిశీలించిన ఎక్సైజ్ అధికారులు



నరసరావుపేట టౌన్ హాలులో ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా అడిషనల్ ఎస్పీ సంతోష్



సాక్షి, నరసరావుపేట: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం విధానంలో భాగంగా మద్యం దుకాణాలను లాటరీ విధానంలో సోమవారం కేటాయించనున్నారు. ఈనెల ఒకటో తేదీ నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో మద్యం దుకాణాల కోసం టెండర్లు దాఖలు చేశారు. తొలుత ఈనెల 9వ తేదీకి దరఖాస్తుల సమయం ముగుస్తుందని ప్రకటించినప్పటికీ అనుకున్నంత స్పందన రాకపోవడంతో దరఖాస్తు గడువు ఈనెల 11వ తేదీ రాత్రి 7 గంటల వరకు పొడగించారు. శని, ఆదివారాలు మద్యం దుకాణాల దరఖాస్తులను పరిశీలించారు. సోమవారం ఉదయం 8 గంటలకు నరసరావుపేట భువనచంద్ర టౌన్ హాలులో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు సమక్షంలో లాటరీ విధానంలో దుకాణాలను కేటాయించనున్నారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఎక్సైజ్ అధికారులు పూర్తిచేశారు. ఏర్పాట్లను జిల్లా అడిషనల్ ఎస్పీ సంతోష్, జిల్లా ఎక్సైజ్ ఈఎస్ మణికంఠ, నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు తదితరులు ఆదివారం పరిశీలించారు. జిల్లాలో మొత్తం 129 మద్యం దుకాణాలకు 2,639 దరఖాస్తులు నమోదయ్యాయి. సగటున ఒక్కో దుకాణానికి 20 మంది దరఖాస్తు చేసుకున్నారు. టీడీపీ ప్రజాప్రతినిధులు బెదిరింపులు దిగడంతో చాలా మంది దరఖాస్తు చేయడానికి ముందుకు రాలేదు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడిన విషయం తెలిసిందే.

పకడ్బందీగా ఏర్పాట్లు

మద్యం దుకాణాల లాటరీ విధానాన్ని తిలకించేందుకు నరసరావుపేట టౌన్‌హాల్‌లో ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. నోటిఫికేషన్ ప్రకారం 129 దుకాణాల్లో వరుస క్రమంలో మొదటి దుకాణానికి నమోదైన దరఖాస్తుదారులందరిని స్టేజ్ ముందుకు పిలుస్తారు. అందులో ఎవరైనా ఇద్దర్ని స్టేజ్ పైకి పిలిచి దరఖాస్తులకు సమానంగా టోకన్ కాయిన్స్ ఉన్నాయో పరిశీలించమని చెబుతారు. వాటిని ఒక డబ్బాలో వేసి కలియతిప్పి జిల్లా కలెక్టర్ చేత ఒక కాయిన్‌కు ఎంపిక చేస్తారు. వారికే దుకాణం కేటాయించబడుతుంది. దీనికి అదనంగా రిజర్వ్‌గా మరో రెండు కాయిన్స్ ఆర్1, ఆర్2 పేరిట డబ్బాలోంచి కలెక్టర్ ఎంపిక చేస్తారు. వీరితో అవసరమైన సంతకాలు సేకరించి, వరుస క్రమంలో రెండో దుకాణానికి సంబంధించి ఇదే పద్ధతిని పాటిస్తారు. ఇలా 129 దుకాణాలకు ఒక్కొక్క దానికి ఒక విజేతతోపాటు ఇద్దరు రిజర్వు విజేతలను ఎంపిక చేస్తారు. విజేతలు 24 గంటలలోగా దుకాణానికి సంబంధించిన వార్షిక లైసెన్స్ ఫీజులో 1/6వ వంతు చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ మొదటి విజేత ఈ మొత్తం చెల్లించలేకపోతే రిజర్వ్-1, రిజర్వ్ 2లకు వరుస క్రమంలో లైసెన్స్ ఫీజు చెల్లించడానికి అవకాశం కల్పిస్తారు.

ఎక్సైజ్ స్టేషన్	దుకాణాల సంఖ్య	దరఖాస్తుల సంఖ్య
నరసరావుపేట	17	292
చిలకలూరిపేట	17	189
సత్తెనపల్లి	15	289
క్రోసూరు	10	329
పిడుగురాళ్ల	12	327
గురజాల	15	242
మాచర్ల	10	123
వినుకొండ	14	338
ఈపూరు	9	245
పెదకూరపాడు	10	265
మొత్తం	129	2,639

నిబంధనల ప్రకారం ఎంపిక



మద్యం దుకాణాలను లాటరీ విధానంలో ఎంపికకు నరసరావుపేట టౌన్ హాల్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. జిల్లా కలెక్టర్ సమక్షంలో దరఖాస్తుదారుల ఎంపిక విధానాన్ని పూర్తి పారదర్శకంగా నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నాం. మద్యం దుకాణం దక్కించుకున్న వారు లైసెన్స్ ఫీజులో 1/6వ వంతు 24 గంటలలోగా చెల్లించాల్సి ఉంటుంది. చెల్లించని పక్షంలో రిజర్వుడు దరఖాస్తుదారుడికి అవకాశం కల్పిస్తాం.

–మణికంఠ, పల్నాడు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్

సాగే..బంగారమాయె...

- భారీగా పడిపోయిన పత్తి ధరలు
- ఇప్పటికే అధిక చీడపీడలతో భారీగా పెరిగిన సాగు వ్యయం
- ఆగస్టు నెలలో క్వింటాలు రూ.8,500 వరకు పలికిన ధర
- నేడు సగటున రూ.6,000 చెల్లిస్తున్న ప్రైవేటు వ్యాపారులు
- సీసీఐ కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలంటున్న రైతులు
- జిల్లాలో తగ్గుతున్న పత్తి సాగు
- ఖరీఫ్‌లో 67,234 హెక్టార్లలో సాగు



దుర్గిలో సాగుచేసిన పత్తి

సాక్షి, నరసరావుపేట: నానాటికీ తెల్ల బంగారం వన్నె తగ్గుతోంది. లాభాలను బట్టి పత్తికి ఆ పేరు వచ్చింది. కానీ ప్రస్తుతం పత్తి సాగు చేసే రైతులకు లాభాల సంగతి దేవుడెరుగు నష్టాలను మిగల్చక పోతే చాలు అనే స్థితికి వచ్చింది. పెరుగుతున్న పెట్టుబడులు, చీడపీడలతో పంట నష్టాలకు తోడు పత్తి ధరలు తగ్గడం రైతులను చిత్తు చేస్తున్నాయి. బీటీ రకం పత్తి వంగడాలు ఎకరానికి 16 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. ఈ ఏడాది వర్షాలు, చీడపీడల బెడదతో ఎకరానికి 10 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి రావడమే గగనమని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఆగస్టు నెలలో పత్తి క్వింటాళ్ల ధర రూ.8,000 దాకా పలికింది. సెప్టెంబర్ మాసం మధ్యలో రూ.7 వేల పైనే పలికింది. ప్రస్తుతం ప్రైవేట్ వ్యాపారులు మాత్రం వర్షానికి పత్తి తగ్గిందని, పత్తి విత్తనాలకు డిమాండ్ లేదనే కారణాలు చెబుతూ క్వింటాళ్ల పత్తి రూ.6,000కే కొనుగోలు చేస్తున్నారు. బోరు బావుల కింద ముందస్తుగా సాగు చేసిన పత్తి ప్రస్తుతం చేతికి వస్తోంది. ప్రభుత్వం సీసీఐ కేంద్రాల ద్వారా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు చెప్పిందే ధరగా ఉంది. కేంద్ర ప్రభుత్వం గత సీజన్‌లో క్వింటాలు పత్తి ధర రూ.7,020 ఉండగా ఈ ఏడాది రూ.7,521 పెంచింది. ఈ మద్దతు ధరతో కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం రైతల నుంచి నేరుగా కొనుగోలు చేస్తే ప్రైవేట్ వ్యాపారాలు దోపిడీకి అడ్డుకట్ట వేయవచ్చని అభిప్రాయపడుతున్నారు.

పెరిగిన సాగు వ్యయం

పత్తి పంట సాగు ఖర్చు రోజురోజుకు పెరిగిపోతోంది. ఎకరం పత్తి పంట సాగు చేయడానికి దుర్గి లాంటి ప్రాంతాల్లో కౌలు రూ.25 వేల దాకా చెల్లించాల్సి వస్తోంది. సగటున ఎకరా పత్తి సాగు చేయడానికి దుక్కికి రూ.5 వేలు, విత్తనాలు, విత్తడానికి రూ.5 వేలు, కలుపు తీయడానికి రూ.2 వేలు, ఎరువులకు రూ.5 వేలు, మందులు పిచికారికి చీడను బట్టి రూ. 5 నుంచి 7 వేలు ఖర్చు అవుతోంది. 10 క్వింటాళ్ల పత్తిని తీయడానికి కూలీలకు మరో రూ.15 వేలు ఖర్చు అవుతోంది. ఇలా ఎకరానికి సుమారు రూ.64 వేల వరకు ఖర్చు అవుతోంది. ప్రస్తుతం పత్తి పంటకు సగటున 10 క్వింటాళ్ల వరకే దిగుబడి వస్తోంది. ప్రైవేట్ వ్యాపారులకు అమ్మితే రైతుకు వచ్చేది కేవలం రూ.60 వేలు మాత్రమే అంటే రైతు, కుటుంబ సభ్యులు చేసిన కష్టం వృథా అవుతూ మరో రూ.2 వేలు నష్టం భరించాల్సి వస్తోంది. దీంతో పత్తి పంటను సాగు చేసే రైతులు రానురాను తగ్గిపోతున్నారు. ఈ ఖరీఫ్‌లో జిల్లాలో పత్తి సాధారణ సాగు 1,07,186 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 65,317 హెక్టార్లలో మాత్రమే సాగైంది.

పత్తి సాగు ఆపేశాను...



గతంలో 10 ఎకరాల వరకు పత్తి పంట సాగుచేసే వాడిని. రాను రాను పత్తికి చీడపీడల బెడద పెరగడం, దిగుబడి తగ్గతుండటంతో నష్టాలు వస్తున్నాయి. దీంతో పత్తి సాగు మానేశాను. ప్రస్తుతం 10 ఎకరాలకుగాను రెండు ఎకరాల్లో మిర్చి సాగు చేయగా మరో నాలుగు ఎకరాల్లో మంచి శెనగ వేయాలనుకుంటున్నాను. మరో నాలుగు ఎకరాలు బీడుగా ఉంచుతున్నాను. పత్తి ధరలు ఆశాజనకంగా ఉండి, పెట్టుబడి ఖర్చులు తగ్గితేనే రైతులు సాగుకు సుముఖత చూపుతారు.

–వెంకటరామిరెడ్డి, రెడ్డిపాలెం, రొంపిచర్ల మండలం.

క్వింటాలు రూ.10 వేలకు కొనుగోలు చేయాలి



ఆరు ఎకరాలలో పత్తి సాగు చేశాను. కౌలు, సేద్యం ఖర్చులు, విత్తనాలు, పురుగుమందులు, కూలీల ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడంతో పత్తి పంట గిట్టుబాటు కావడం లేదు. క్వింటాలు సగటున రూ.6,000 మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసిన దాఖలు లేకపోవడంతో స్థానిక వ్యాపారులే కొనుగోలు చేస్తున్నారు. కనీసం క్వింటా పదివేలకు తగ్గకుండా మద్దతు ధరను ప్రకటించాలి. చాలామంది రైతులు ప్రతి పంటను వదిలేయడంతో తెల్ల బంగారం కాస్త తెల్లబోయింది.

–జి.హనుమంతరావు, పత్తి రైతు, దుర్గి.

తగ్గుతున్న సాగు...



బీటీ పత్తికి రానురాను చీడపీడల బెడద ఎక్కువ అవుతోంది. దీంతో రైతుకు పెట్టుబడి ఖర్చు పెరుగడంతోపాటు దిగుబడి తగ్గిపోతోంది. ధర తక్కువగా ఉంటే పెట్టుబడి డబ్బులు కూడా రాక నష్టాలపాలయ్యే అవకాశం ఉంది. దీంతో రైతులు పత్తి సాగు వదలి ప్రత్యామ్నాయ పంటల వైపు వెళుతున్నారు.

–ఐ మురళి, పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి.

16న సెపక్ తక్రా జిల్లా జట్ల ఎంపిక

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్స్ పురుషులు, మహిళలు జిల్లా జట్ల ఎంపిక ఈ నెల 16న సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతుందని జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డెంపూడి పవన్‌కుమార్ ఆదివారం తెలిపారు. క్రీడాకారులు ఆధార్ కార్డుతో హాజరు కావాలని కోరారు.

కాశీవిశ్వేశ్వరుని సేవలో తెలంగాణ జూనియర్ సివిల్ జడ్జి

నకరికల్లు: నర్సింగపాడు గ్రామంలోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వారిని తెలంగాణలోని దేవరకొండ జూనియర్ సివిల్ జడ్జి జస్టిస్ కె.వి.హరీష్‌బాబు దర్శించుకున్నారు. స్వామివారిని, శ్రీరాజరాజేశ్వరీ అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ చైర్మన్ బిజ్జం కృష్ణారెడ్డి జడ్జికి స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట కుటుంబ సభ్యులు ఉన్నారు.



స్వామి వారిని దర్శించుకుంటున్న జడ్జి

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట: రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాలు, తెగల అభ్యర్థులు డీఎస్సీ పరీక్ష ఉచిత శిక్షణకు భోజనం, వసతి సౌకర్యాలతో మూడు నెలల పాటు శిక్షణ పొందేందుకు ఈనెల 21వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ వెల్ఫేర్ సాధికారిత అధికారి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 22వ తేదీ నుంచి 25లోపు హాల్ టికెట్ డౌన్‌లోడింగ్ చేసుకోవాలని, 27వ తేదీన పరీక్ష నిర్వహించటం జరుగుతుందన్నారు. మెరిట్ లిస్టు ప్రకటన 28వ తేదీన, జిల్లాలవారీగా ఎంపికైనవారి జాబితా 30వ తేదీన, కోచింగ్ సెంటర్ల వారీగా అభ్యర్థుల ఎంపిక నవంబరు 3వ తేదీన, కోచింగ్ 6వ తేదీ నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఎస్జీటీలకు ఇంటర్మీడియెట్‌తో పాటు డైట్‌సెట్, టెట్, స్కూల్ అసిస్టెంట్స్‌కు డిగ్రీ గ్రాడ్యుయేషన్, బీఈడీ, టెట్ విద్యార్హతలు కలిగినవారు అర్హులన్నారు. అభ్యర్థుల కుటుంబ వార్షికాదాయం రూ2.50లక్షల లోపు కలిగిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అర్హులన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పరీక్ష ద్వారా ఎంపిక చేయటం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

పిడుగురాళ్ల: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతిచెందిన సంఘటన పిడుగురాళ్ల పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణ ఎస్ఐ శివనాగరాజు తెలిపిన వివరాల ప్రకారం రెడ్డిగూడెం గ్రామానికి చెందిన షేక్ దాదాపీర్ (38), పిడుగురాళ్ల మండలం జానపాడు గ్రామంలో శుభకార్యానికి వెళ్లి తిరిగి ద్విచక్రవాహనంపై వస్తున్న సమయంలో పట్టణంలోని జానపాడు రోడ్డులో వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం సమీపంలో మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. ఘటనలో దాదాపీర్‌కు తీవ్రగాయాలయ్యాయి. పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని భార్య షేక్ అఫ్రీఫున్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.
● మరో ఘటనలో పట్టణానికి చెందిన కాటేపల్లి వెంకటేశ్వర్లు (50) అతని స్నేహితుడితో కలిసి కల్లం టౌన్‌షిప్‌లో నుంచి వస్తున్న సమయంలో ఖలీల్ దాబా వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడి వెంకటేశ్వర్లు సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు.

కుక్కను తప్పించబోయి వ్యక్తి మృతి



మార్టూరు: అడ్డు వచ్చిన కుక్కను తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరోకరు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండల కేంద్రంలో శనివారం రాత్రి జరిగింది. ఏఎస్సై సైదా వివరాల మేరకు.. వలపర్ల ఎస్సీ కాలనీకి చెందిన కొప్పుల సుబ్బారావు (48) అదే కాలనీకి చెందిన గారపాటి శ్రీనుతో కలిసి ద్విచక్ర వాహనంపై మార్టూరు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో సర్వీసు రోడ్డులోని వాసవీ గ్రానైట్ సమీపంలో హఠాత్తుగా కుక్క అడ్డు రావడంతో దానిని తప్పించే క్రమంలో అదుపుతప్పి ఇద్దరూ కింద పడిపోయారు. బైకు నడుపుతున్న సుబ్బారావు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా, శ్రీను తీవ్రంగా గాయపడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న శ్రీనును గుంటూరు సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మృతుడు సుబ్బారావు తమ్ముడు బుజ్జిబాబు ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ సైదా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

పలు రూపాల్లో మహిషాసుర మర్దని

● అపురూప శిల్పచిత్రాల ప్రదర్శన
● దేశవిదేశాల్లోని శతాబ్దాల నాటి శిల్పాల ఛాయాచిత్రాల సేకరణ
● బాపట్ల జిల్లా చుండూరు మండలం మోదుకూరు గ్రామంలో ఏర్పాటు



ప్రదర్శనను తిలకిస్తున్న భక్తులు

మోదుకూరు(తెనాలి): భారతదేశంలో పర్వదినాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. దసరా నవరాత్రులు అందులో ఒకటి. విజయదశమి సందర్భంగా బాపట్ల జిల్లా చుండూరు మండలంలోని మోదుకూరు గ్రామంలో భారీజాతర జరగటం ఆనవాయితీ. గ్రామస్తులే కాకుండా సమీప గ్రామాలవారు, ఎక్కడెక్కడో స్థిరపడిన ఆ ప్రాంతీయులు వేలాదిగా జాతరలో అక్కడి శ్రీకనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుంటారు. ఈసారి జాతరలో అక్కడి వేమన సాహిత్య వికాస పరిషత్ భవనంలో శక్తిస్వరూపిణి అయిన అమ్మవారి మహిషాసురమర్దని చిత్రప్రదర్శన నిర్వహించటం ప్రత్యేకత! సమీప గ్రామం తొట్టెంపూడికి చెందిన యువ పురావస్తు పరిశోధకుడు, ఇండియన్ నేషనల్ కల్చరల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ హెరిటేజ్ (ఇన్‌టాక్) సభ్యుడైన పాములపాటి శ్రీనాథ్‌రెడ్డి ఈ చిత్ర ప్రదర్శనను ఏర్పాటుచేశారు. తాను సేకరించిన దేశవిదేశాల్లోని అపురూపమైన ఛాయాచిత్రాలను ఇక్కడ ప్రదర్శించారు. రెండురోజులపాటు జరిగిన ఛాయాచిత్ర ప్రదర్శనను జాతరకు వచ్చిన భక్తులు ఎందరో తిలకించారు.

75 శిల్పాలకు చెందిన ఛాయాచిత్రాలు..

శిల్ప చిత్రాల వివరాల్లోకి వెళితే... మహిష రూపంలో ఉన్న రాక్షసుడిని సంహరించటానికి అమ్మ అవతారం దాల్చుతుంది. శివుడి త్రిశూలాన్నీ, విష్ణువు విష్ణుచక్రాన్నీ, ఇంద్రుడి వజ్రాయుధాన్నీ...ఇలా ఒక్కో దేవత/దేవుడు నుంచి వివిధ ఆయుధాలను స్వీకరిస్తుంది. మహిషాసురుడిని సంహరిస్తుంది. కొన్నిసార్లు ఎనిమిది చేతులతో, మరోసారి 10 లేదా 18 చేతులతో దర్శనమిస్తుంది అమ్మవారు. మహిషాసుర మర్దనిని ప్రాంతాలవారీగా అక్కడి శిల్పులు రకరకాలుగా తమ నేటివిటీకి తగినట్టుగా చిత్రీకరిస్తారని తెలిసిందే. మహిళ సైతం విభిన్నంగా ఉంటుంది. సాధారణంగా రాక్షస సంహారంలో అమ్మ ఉగ్రరూపంలో ఉన్నప్పటికీ శాంత వదనంతో అందంగా ఉన్నట్టు పురాణాలు వర్ణించాయి. శిల్పులు సహితం ఆదేవిధంగా ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. మహిషాసుర సంహారం వివిధ రకాలుగా జరిగినట్టుగా శిల్పాలను రూపొందించారు. దేశంలోని ఒక్కో ప్రాంతంలో, విదేశాల్లోనూ తలా కరకంగా తయారైన శిల్పాలు భక్తులచే పూజలను అందుకుంటున్నాయి. ఇలా విభిన్నమైన 75 శిల్పాలకు సంబంధించిన ఛాయాచిత్రాలు ఒకేచోట ప్రదర్శించటంతో భక్తులకు వాటిని చూసేందుకు అవకాశం లభించింది. ఇదే అభిప్రాయాన్ని గ్రామానికి చెందిన అంతర్జాతీయ ఫొటోగ్రాఫర్, ఫొటోజెనిక్ ఆర్ట్ సర్కిల్ వ్యవస్థాపకుడు కానాల సుధాకరరెడ్డి, కాకినాడకు చెందిన భక్తుడు టి.వీరభద్రరావు వెల్లడించారు.

అరుదైన శిల్పాల ఛాయాచిత్రాలు...



పురావస్తు పరిశోధనలో భాగంగా అరుదైన శిల్పచిత్రాలను సేకరిస్తున్నాను. మహిషాసుర మర్దని శిల్పాలు వివిధ రూపాల్లో ఉండటం గమనించాను. ఒకటొకటిగా సేకరిస్తూ వస్తుంటే మన దేశంలోనే వేర్వేరు ప్రాంతాల్లో అపురూపమైనవి లభించాయి. వీటన్నిటికి అమ్మవారి భక్తులకు అందుబాటులో ఉంచాలనే ప్రదర్శనగా ఉంచాను. అందరూ అభినందించటం సంతోషంగా ఉంది.

–పాములపాటి శ్రీనాథ్‌రెడ్డి,
యువ పురావస్తు పరిశోధకుడు

విఘ్నాలు తొలగి విజయాలు చేకూరాలి

జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ దంపతుల ఆయుధపూజ



జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ దంపతులు, అదనపు ఎస్పీలు, డీఎస్పీ, ఇతర అధికారులు

నరసరావుపేట: విఘ్నాలు తొలగి విజయాలు చేకూరాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. విజయదశమి పండగను పురస్కరించుకొని శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ దంపతులు ఆయుధ పూజ, కనకదుర్గ అమ్మవారి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ జిల్లా ప్రజలు, పోలీస్ అధికారులు, సిబ్బందికి విజయ దశమి శుభకాంక్షలు తెలియచేశారు. అమ్మవారి పూజ అనంతరం వాహనాలు, ఆయధాలకు పూజ నిర్వహించారు. అదనపు ఎస్పీలు జేవీ సంతోష్ (పరిపాలన), డి.రామచంద్ర రాజు(ఆర్మ్‌డ్ రిజర్వ్), సీహెచ్ లక్ష్మీపతి (క్రైం), డీఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ గాంధీరెడ్డి, సీఐలు, ఆర్ఐలు, డాక్టర్ చింతాకృష్ణ చైతన్య, మేనేజర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉండవల్లిలో ముంబై పోలీసులు

● మూడు రోజులు విస్తృతంగా తనిఖీలు
● చీరలు, ఇతర దుస్తులు దొంగిలించిన ముగ్గురి అరెస్ట్
● సహకరించిన వారి కోసం అన్వేషణ



తాడేపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద ముంబై పోలీసుల వాహనం

తాడేపల్లిరూరల్: నవ్యాంధ్రరాజధాని ముఖద్వారమైన ఉండవల్లిలో మూడు రోజుల పాటు ముంబై పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పలు వస్త్ర దుకాణాల్లో దుస్తులు కొనుగోలు చేసి చివరకు ఆదివారం రాత్రి ఉండవల్లిలో ఉన్న ఓ వస్త్ర దుకాణం యజమానితో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని దొంగతనానికి సహకరించిన మహిళల కోసం విచారిస్తున్నారు. వివరాలు.. తాడేపల్లిలో వస్త్ర వ్యాపారం నిర్వహించే పలువురు వ్యాపారస్తులు తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో ఉన్న కొంతమంది వస్త్ర వ్యాపారులు తాడేపల్లిలో ఉన్న దుస్తులు దొంగతనం చేసేవారితో సంధి కుదుర్చుకుని దేశంలో పలు మహానగరాల్లో ఉన్న పెద్దపెద్ద వస్త్ర దుకాణాల్లో చోరీకి పాల్పడి ఆ దుస్తులుతాడేపల్లి తీసుకువస్తారు. ఇక్కడ వున్న వ్యాపారస్తులు తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని వినియోగదారులకు ఎక్కువ ధరకు అమ్ముతారు. ముంబైలో కూడా ఇదే తరహాలో సెప్టెంబర్ 30, 2024న దుకాణంలో భారీ మొత్తంలో చీరలు, ఇతర దుస్తులు చోరీకి గురికావడంతో అక్కడ ఆ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

దర్యాప్తు ఇలా....

గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఇలాంటి చోరీలకు పాల్పడేవారు ఉన్నారని తెలియడంతో ముంబై పోలీసులు మూడు రోజుల పాటు నవ్యాంధ్ర రాజధానిలో మకాం వేసి విడివిడిగా తిరుగుతూ వస్త్ర దుకాణాల్లో దుస్తులు కొనుగోలు చేశారు. చివరకు ఉండవల్లిలో పేరులేని దుకాణంలో ముంబైలో చోరీకి గురైన చీరలు, ఇతర దుస్తులు కనిపించడంతో అక్కడ షాపు యజమానితో మాట్లాడి ఆ దుస్తులు చూపించి షాపు యజమాని ప్రసాద్, షాపులో పనిచేస్తున్న కుమార్, శ్రీకాంత్‌లను అదుపులోకి తీసుకుని తాడేపల్లి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు.

మహిళలు చోరీకి పాల్పడినట్లు గుర్తింపు

ముంబై పోలీసులు రికవరీ చేసిన చీరలు, దుస్తులు చోరీ చేసినవని గుర్తించినప్పటికీ చోరీకి పాల్పడింది మహిళలు. వారు ఎవరనేది గుర్తించడం స్థానిక పోలీసులవలన గానీ ముంబై పోలీసుల వల్ల కానీ కాలేదు. పట్టుకున్న వారు తమకు తెలియదని చెప్పడంతో ఈ ముగ్గురికి ముంబై తీసుకువెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

మృతుడి కుటుంబానికి కరణం పరామర్శ



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం

చీరాల టౌన్: అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పులి శ్రీనివాసరావు కుటుంబాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పరామర్శించారు. చీరాల ప్రభుత్వాసుపత్రికి వెళ్లి శ్రీనివాసరావు మృతదేహానికి నివాళులర్పించారు. అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యం చెప్పి వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఘటన జరిగిన ప్రదేశాన్ని సందర్శించారు. స్థానిక నాయకులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చుండూరు(వేమూరు): దసరా ఉత్సవాలకు నిర్వహించిన సైకిల్ పోటీల్లో కె.ఫణీంద్ర (24) వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. చుండూరు మండలంలోని వేటపాలెంలో 11న సైకిల్ పోటీలు నిర్వహించారు. పిట్టలవానిపాలేనికి చెందిన ఫణీంద్ర ఈ పోటీల్లో పాల్గొన్నాడు. ఎదురుగా వస్తున్న వ్యక్తి తప్పించబోయి సైకిల్‌పై నుంచి పడిపోయాడు. వెంటనే 108 వాహనంలో అతనిని తెనాలి ప్రభుత్వం వైద్యశాలకు చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. అక్కడి నుంచి గుంటూరు ప్రభుత్వం వైద్యశాలకు తీసుకెళ్లాడు. శనివారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడి మృతి

నిజాంపట్నం: వేటకు వెళ్లిన మత్స్యకారుడు మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కొత్తపాలేనికి చెందిన చెన్ను నాంచారయ్య (58) శనివారం గ్రామంలోని నాలి చెరువులో వేటకు వెళ్లాడు. చేపలు పడుతున్న సమయంలో కాలుజారి ప్రమాదవశాత్తు రేవులో పడి మృతి చెందాడు. ఆదివారం తెల్లవారుజామున నాంచారయ్య మృతదేహం నీటిపై తేలడంతో గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు తెలియజేశారు.

పోక్సో కేసు నమోదు

కర్లపాలెం: మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు. వివరాల మేరకు.. పేరలి గ్రామానికి చెందిన ఆరేళ్ల బాలిక శనివారం సాయంత్రం తమ ఇంటి సమీపంలో ఉన్న కొళాయి వద్ద ఉంది. అదే గ్రామానికి చెందిన 50 ఏళ్ల పెరుమళ్ల భాగ్యారావు బాలికకు మాయమాటలు చెప్పి ఇంట్లోకి తీసుకువెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. ఆ బాలిక జరిగిన విషయాన్ని ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు చెప్పింది. ఈ విషయమై బాలిక తల్లిదండ్రులు ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

బాలుడికి తీవ్ర గాయాలు



కావ్య(ఫైల్)



బాలిక మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి చెందగా బాలుడికి తీవ్ర గాయాలైన ఘటన సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. ఫిరంగిపురం మండలం 113 తాళ్లూరుకు చెందిన మీసాల వంశీ తన చిన్నమ్మ కుమార్తె జొన్నలగడ్డ కావ్య(14)ను తమ ఇంటికి తీసుకెళ్లేందుకు ఆదివారం ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని వెళుతున్నాడు. గ్రామంలోని శ్మశాన వాటికి సమీపంలోకి వెళ్లగానే వెనుక వైపు నుంచి కూలీలతో వస్తున్న ట్రాక్టర్ నిర్లక్ష్యంగా క్రాస్ చేసే క్రమంలో వెనుక ఉన్న ట్రక్కు తగిలి వారిని కొంత దూరం ఈడ్చుకుపోయింది. దీంతో జొన్నలగడ్డ కావ్య అక్కడికక్కడే స్పృహ తప్పగా మీసాల వంశీ తీవ్రంగా గాయపడ్డాడు. ఇరువురిని చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించగా కావ్య మృతి చెందింది. వంశీని మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. కావ్య లక్కరాజుగార్లపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. వంశీ పదో తరగతి పూర్తి చేసి గుంటూరులోని రియల్ ఎస్టేట్ కంపెనీలో చిన్నపాటి ఉద్యోగం చేస్తున్నాడు. కావ్య మృతి చెందడంతో తల్లిదండ్రులు సీత, కోటేశ్వరరావు, పెద్దమ్మ మహాలక్ష్మితో పాటు బంధువులు పెద్ద ఎత్తున కన్నీరు మున్నీరయ్యారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కావ్య మృతదేహాన్ని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గార్లపాటి దాసు సందర్శించి నివాళ్ళులర్పించారు.

కళాకారుడిగా నా ఎదుగుదలకు తోడ్పడిన తెనాలి

బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి అవార్డు గ్రహీత యడ్ల గోపాలరావు



యడ్ల గోపాలరావుకు బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి పురస్కారం ప్రదానం

తెనాలి: రంగస్థల కళాకారుడుగా తన ఎదుగుదలకు తెనాలి ఎంతగానో తోడ్పడిందని విజయనగరం జిల్లాకు చెందిన ప్రముఖ పౌరాణిక రంగస్థల నటుడు, పద్మశ్రీ అవార్డుగ్రహీత యడ్ల గోపాలరావు చెప్పారు. కళల కాణాచి(తెనాలి), వేదగంగోత్రి ఫౌండేషన్(విజయవాడ) సంయుక్త నిర్వహణలో స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో దసరా రోజు రాత్రి జరిగిన ప్రత్యేక సభకు కళల కాణాచి ఉపాధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు అధ్యక్షత వహించారు. ప్రముఖ రంగస్థల నటుడు బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి జాతీయ రంగస్థల పురస్కారాన్ని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ చేతులమీదుగా యడ్ల గోపాలరావుకు ప్రదానం చేశారు. సభలో గోపాలరావు తన కృతజ్ఞతాపూర్వక ప్రసంగంలో తన తొలి ప్రదర్శన తెనాలి సమీపంలోని పెరవలిలో ఇచ్చినట్టు గుర్తుచేశారు. ఇక్కడి నాటకాల కాంట్రాక్టరు తనకు తెనాలిలో బస ఏర్పాటుచేసి, నాటక అవకాశాలను ఇప్పించారని సోదాహరణంగా చెప్పారు. నాటక పరిశోధకుడు, విశ్లేషకుడు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు మాట్లాడుతూ నాటకోత్సవాల్లో భాగంగా ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన సాంఘిక పద్యనాటక విభాగం పోటీలు వచ్చే ఏడాదినుండి మరింతగా విస్తరించాలన్న ఆకాంక్షను వ్యక్తంచేశారు. నాటకం, సినిమాలతో తనకు గల అనుబంధాన్ని తెనాలికి చెందిన ప్రవాస భారతీయుడు డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి వివరించారు. వేదగంగోత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వరప్రసాద్, కళల కాణాచి వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీరచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా, ప్రముఖ పౌరాణిక నటుడు, దర్శకుడు డాక్టర్ నిభానుపూడి సుబ్బరాజు, పట్టణ రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి ఏపీ ఆదినారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు గరికపాటి సుబ్బారావు మాట్లాడారు. కళల కాణాచి ప్రధాన కార్యదర్శి గోపరాజు విజయ్, వ్యవస్థాపక కార్యదర్శి షేక్ జానిబాషా, కోశాధికారి దేవరపల్లి భవాని, సహాయ కార్యదర్శులు అయినాల మల్లేశ్వరరావు, కత్తి సౌజన్య పర్యవేక్షించారు.

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ మనువాదుల కుట్ర

మాల సంఘాల జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు



సమావేశంలో మాట్లాడుతున్న మల్లెల వెంకట్రావు

నగరం: ఎస్సీ, ఎస్టీల వర్గీకరణ మనువాదుల కుట్ర అని మాల సంఘాల జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు అన్నారు. మండలంలోని సజ్జావారిపాలెంలో శనివారం ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో మాలల చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సభకు జై భీమ్‌రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దోవా రమేష్ రాంజీ అధ్యక్షత వహించగా, వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ తీర్పులో రాజ్యాంగ మౌలిక సూత్రాలను విస్మరించారని ఆరోపించారు. రాజ్యాంగంలో క్రిమి లేయర్ పదం ఎక్కడా నిర్వచింపబడలేదని, అటువంటి పదాన్ని వర్గీకరణకు అపాదించడం రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. ఈ కార్యక్రమంలో మాల సంఘాల నాయకుడు గోళ్ల అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వంలో మాల ఉద్యోగులను వేదింపులకు గురిచేస్తున్నారన్నారు. వేధింపులపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాల ఉద్యోగ సంఘం నాయకుడు డి.ప్రసాద్, పలు పార్టీల నాయకులు నీలా జోజిబాబు, బుస్సా నాగరాజు, రవికిరణ్, కోటయ్య పాల్గొన్నారు.

తెలుగు సాహితీ కళా జాతరకు అడుసుమల్లికి ఆహ్వానం



బాపట్ల: ప్రపంచ తెలుగు సాహితీ కళా జాతరకు బాపట్లకు చెందిన అడుసుమల్లి మల్లికార్జునకు ఆహ్వానం దక్కింది. శ్రీ శ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 19, 20 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో 24 గంటల పాటు ప్రపంచ తెలుగు సాహిత్య కళా జాతర నిర్వహించనున్నారు. బాపట్ల నగరం నుంచి రచయిత, కవి, విశ్రాంత ఉద్యోగి మల్లికార్జునకు ఆహ్వానం అందుకున్నారు. ఈ ఉత్సవంలో పాల్గొన్న వారి పేరు ప్రపంచ రికార్డులో నమోదు కాబడుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ ట్రాన్స్‌కో రిటైర్డు ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ ఆలపర్తి నారాయణస్వామి, సభ్యులు శ్రీనివాస్, లైబ్రేరియన్ శివాజిగణేష్ పలువురు అభినందించారు.

సీడ్ యాక్సిస్ రోడ్డులో ప్రమాదం

● బైక్‌ని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
● లింగాయపాలేనికి చెందిన వ్యక్తి మృతి
● రోడ్డుపై బైఠాయించిన బంధువులు



ఘటనా స్థలంలో మృతదేహం

తాడికొండ: తుళ్లూరు మండలం రాయపూడి సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో ఆదివారం రాత్రి ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లింగాయపాలెం గ్రామానికి చెందిన నూతక్కి రామారావు(47) మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి 2 గంటల వరకు రాకపోవడంతో బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. వాహనాలు నిలిపేయడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. తమకు న్యాయం చేయాలంటూ బంధువులు రాత్రి 8 గంటల వరకు కూడా విరమించకపోవడంతో పరిస్థితి ఆందోళన కరంగా మారింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు న్యాయం చేసేలా తమకు స్పష్టమైన హామీ ఇచ్చే వరకు కదిలేది లేదని ఆందోళన కొనసాగిస్తున్నారు. మృతదేహాన్ని తరలించేందుకు పోలీసులు కుటుంబ సభ్యులతో మంతనాలు చేస్తున్నారు.

12 సవర్ల బంగారం చోరీ



చిందరవందరగా పడేసిన వస్తువులు, దుస్తులు

తెనాలిరూరల్: తెనాలి పట్టణంలో 12 సవర్ల బంగారం ఆభరణాలు చోరీకి పాల్పడిన ఘటన ఆలస్యంగా ఆదివారం వెలుగుచూసింది.

వివరాలు..

పోలీసు శాఖలో అటెండర్‌గా పని చేసి రిటైర్ అయిన ఈలప్రోలు శివన్నారాయణ బాలాజీరావుపేటలో చుట్టల కంపెనీ దగ్గరలో నివాసం ఉంటున్నాడు. భార్య వెంకాయమ్మతో కలసి పై అంతస్తులో ఉంటుండగా శివన్నారాయణ కుమారుడు కింద పోర్షన్‌లో ఉంటున్నారు. కుటుంబ సభ్యులంతా కలసి ఈ నెల 8వ తేదీన తీర్థయాత్రలకు రామేశ్వరం వెళ్లారు. తిరిగి ఆదివారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో ఇంటికి వచ్చిన వీరు చోరీ జరిగిందని గుర్తించారు. శివన్నారాయణ నివాసం ఉంటున్న పై అంతస్తు ఇంటి తలుపులు పగుల కొట్టి ఉండటంతో పాటు బీరువాలోని వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉండటాన్ని గుర్తించారు. దీంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని వారు త్రీ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల సమాచారంతో ఆదివారం ఉదయం క్లూస్ టీమ్ వచ్చి ఆధారాలు సేకరించుకుని వెళ్లారు. బెడ్‌రూమ్‌లో ఉన్న బీరువా పగులగొట్టి అందులో ఉన్న సుమారు 12 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.ఐదు వేల నగదు దుండగులు అపహరించుకు వెళ్లినట్లు శివన్నారాయణ తెలిపారు. అయితే బంగారు నగలు, నగదు మాత్రమే తీసుకు వెళ్లిన దుండగులు కొన్ని వెండి వస్తువులు మాత్రం అక్కడే వదిలేసి వెళ్లారు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.